# శతమానం భవతి ...

డిసెంబరు 15, ఆదివారం రోజున బాపుగారికి ఎనభై సంవత్సరాలు నిండుతాయి. చిత్రకారుడిగా, కార్టూనిస్టుగా, సినిమా డైరెక్టరుగా 60 ఏళ్ళు పైబడి తెలుగువారిని అలరిస్తూ మన్ననలు అందుకోడమే కాక యిన్నాళ్ళూ స్థాణువుగా వున్న తెలుగు లిపికి నడకలు నేర్పి పరిగెత్తించారు. ఎంచుకున్న రంగాలన్నిట్లో అత్యున్నత స్థాయికి చేరుకున్నా యిప్పటికీ వారికున్న అకుంఠిత దీక్ష, నిబద్ధత, ముఖ్యంగా నిరాడంబరత చూసి విస్తుపోక తప్పదు. దానికి వుదాహరణ ఈమధ్య జరిగిన ఒక వుదంతం.

పి.జి. వుడ్‌హౌస్ రచనా చమత్కృతిని, హాస్యరసాన్ని విస్తృతంగా తెలుగులోకి తీసుకురావాలన్న సంకల్పంలో పరిచయమైన కొందరు మహానుభావుల్లో బాపు-రమణ గార్లు ముఖ్యులు. ఆ యిద్దరూ వుడ్ హౌస్ అభిమానులు. బాపుగారికి తండ్రినుంచి అది సంక్రమిస్తే రమణగారు విశాఖపట్నంలో చిన్నప్పుడు చేసిన చిరుద్యోగంలో ఖజానికి వేళ్లాడే సంచిలోంచి వుడ్‌హౌస్ పుస్తకం తీసి చదివేవాడినంటూ కోతి కొమ్మచ్చిలో రాశారు.

లోగడ **ఆపద్బాంధవి-ఉరఫ్-పాపాలభైరవి, అంకుల్ డైనమైట్** పేర్లతో వచ్చిన నా రెండు రచన లకి అడిగిందే తడవుగా బాపుగారు చక్కటి ముఖచిత్రాలు అందించడం నా సుకృతం. బాపుగారి బొమ్మలు, దస్తూరి, సంతకం వాటికి value added అయినాయి.

త్వరలో విడుదల కానున్న నా అయిదవ పుస్తకం **లంకె-బిందెలు** కి కూడా వారే కవర్ పేజి వేయా లని ఫిబ్రవరి నెలలో కలిసి డిటిపి కాపీ యిచ్చాను. అప్పుడు వారి ఆరోగ్యం సరిగా లేదు, నీరసంగా కని పించారు. ''టైం పడుతుందండీ'' అన్నారు. ''ఫరవాలేదు మీరు యిచ్చినప్పుడే పుస్తకం ముద్రణకి వెడు తుంది, మీ ఆరోగ్యం ముఖ్యం'' అని చెప్పి వచ్చేశాను. మే నెల చివర్లో వారికి భార్యా వియోగం కలగ డంతో నేను మళ్ళీ కవర్ పేజి వూసెత్తలేదు. సెప్టెంబర్లో కలిసినప్పుడు వారి ముఖంలో కొంత కులాసా కన బడింది. ''ఈమధ్యనే మీ లంకె-బిందెలు చదివాను, దాంతో మరోసారి Frozen Assets కూడా చది వాను, మూలానికి చక్కటి న్యాయం చేకూర్చారు, దీపావళిలోగా మీకు కవర్ పేజి వేసి పంపిస్తాను'' అన్నారు.

దీపావళి వెళ్ళిన మూడోరోజు పొద్దున్నే ఫోన్ చేసి ''సారీ, అన్న ప్రకారం పంపలేకపోయాను, మన్నించాలి, ఆరోగ్యం సరిగా లేదు, యిప్పుడే హాస్పిటల్లో జాయిన్ అవుతున్నాను'' అని చెప్పగానే అంతటి కష్టంలో కూడా గుర్తుంచుకుని అలా చెప్పినందుకు నాకాయన మీద గౌరవం మరింత యినుమడించింది. ''ముందు మీ ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోండి, మరో నెల, రెండు నెలల తరవాత యిచ్చినా ఫరవా లేదు, లేకపోతే స్వాతిలో మీరు వేసే కార్టూన్లలా నల్ల పెన్నుతో నాలుగు రేఖలు వేసి పంపితే కంప్యూటర్

మీద యిక్కడ ఎవరి చేతనైనా రంగులు వేయిస్తాను'' అన్నాను. దానికాయన, ''లేదండి, వేస్తే నేనే వెయ్యాలి, లేకపోతే లేదు, అలా చెయ్యడం నాకు నచ్చదు'' అన్నారు.

నవంబరు మొదట్లో మరోసారి ఫోన్ చేసి, ''ఆరోగ్యం బొత్తిగా బాగోలేదు, కాళ్ళు వాచినాయి, అందుకని నా ఆర్టిస్ట్ ఫ్రెండు కవర్ పేజి వేస్తాడు, దానికోసం ఆయనకి చిన్న రైటప్ పంపిస్తున్నాను,



ఫైనల్ కూడా అతనే వేస్తాడు'' అని చెప్పారు. మర్నాడు ఆ ఆర్టిస్టు నాతో ఫోన్లో ''సార్, దేశంలో యింత మంది ఆర్టిస్టులుండగా బాపుగారు నాకే యిది అప్పగించినందుకు గర్వంగా వుంది కాని వారిని సంతృప్తి పరచలేమోనని భయంగా వుంది'' అన్నాడు. వారం పదిరోజులు అతను చేతిలో వున్న పని పక్కకి పెట్టి దృష్టంతా దీని మీదనే కేంద్రీకరించి కొన్ని స్కెచ్‌లు బాపుగారికి మెయిల్ చేశానని చెప్పాడు. అవెలా వున్నాయో నేను చూడలేదు కాని, ఆ ఆర్టిస్టు భయపడింది నిజమే అన్నట్టుగా పదిరోజుల క్రితం బాపుగారే ఫోన్ చేసి ''కవర్ పేజి నేనే వేస్తున్నానండి, నాలుగైదు రోజుల్లో మీకది పోస్టులో చేరుతుంది'' అన్నారు. మధ్యాన్నానికి మరో ఫోను – ''బొమ్మలు పూర్తయినాయి, మా ఫ్రెండొకతనికి కంప్యూటర్తో రంగులు అద్దడం వచ్చు, సాయంత్రం యింటికి రమ్మని పిలిచాను, రాత్రి లోపల మీకు కవర్ పేజి మెయిల్లో పెడ తాను'' అన్నారు. అన్నట్టే రాత్రి ఎనిమిదింటికల్లా Sir, please check your mail అంటూ SMS చేశారు. కేవలం వుడ్‌హౌస్ మీద అభిమానంతో, గౌరవంతో యిచ్చిన మాట నిలబెట్టుకునేందుకు బాపు గారు పడిన శ్రమకి, నిబద్ధతకి కృతజ్ఞతలు ఎలా తెలుపుకోవాలో తెలీక – **ఎల్లరి మనసులు ఝల్లన చేసే చల్లని దేవుని అల్లరిలో** తెలుగువారు మరింతకాలం హాయిగా నవ్వుతూ తుళ్ళుతూ లాహిరి(మైకం)లో వుండేందుకు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వారు వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నాను.

– గబ్బిట కృష్ణమోహన్

PS: బాపుగారికి 75 ఏళ్ళు నిండినపుడు ఆయనకి చెప్పకుండా రమణగారు కొంతమందికి యింట్లో భోజ నాలు ఏర్పాటు చేసినందుకు యిలాంటివి నచ్చదంటూ బాపుగారు కోప్పడ్డారని రమణగారే నాకు చెప్పారు. ఇప్పుడాయన మన మధ్యలో వుండుంటే ఈసారి కూడా ఏదో చేసి మళ్ళీ కోపం తెప్పించి వుండే వారేమో! ఈ సందర్భంగా బాపుగారి కోరిక ప్రకారం వారిని కూడా ఓసారి స్మరించుకుందాం.

ఇంతకీ బాపుగారు వేసిన ముఖచిత్రం చూడాలంటే జనవరిలో రాబోయే ఆ పుస్తకం కొని చూడాల్సిందే.